వ్యాపార రంగాల్లోని మహిళలకు వ్యక్తిగత రుణాలు

ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం

మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్ఎం అబ్దుల్ రహీం

శాయంపేట, ఫిబ్రవరి 18: పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న మహిళలకు ఎస్‌బీఐ ద్వారా వ్యక్తిగత రుణాలు ఇస్తామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం అన్నారు. శాయంపేటలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం పరకాల, శాయంపేట, నడికూడ మండలాల ఏపీఎం, సీసీ, వీఓఏలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఎస్‌బీఐ కృషి చేస్తుందన్నారు. మండలంలోని వెయ్యి మహిళా సంఘాల మహిళలకు రుణాలను అందిస్తామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించి మళ్లీ రుణాలు పొందాలని సూచించారు. ఎస్‌బీఐలో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రమాద ప్రీమియం చెల్లించి రూ.10లక్షల నుంచి రూ.40లక్షల వరకు లబ్ధి పొందవచ్చన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు వ్యాపారాల అభివృద్ధి కోసం వ్యక్తిగత రుణాలు అందజేస్తామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ లక్ష్యాల్లో వంద శాతం టార్గెట్ పూర్తి చేసిన ఉత్తమ ఏపీఎం, సీసీ, వీఓఏలకు బహుమతులు అందజేశారు. శాయంపేట నుంచి మహి ళా సంఘాల రుణాలతో ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగి ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న దాసరి కల్పనను ఆర్ఎం అబ్దుల్ రహీం శాలువాతో సత్కరించారు. బ్యాంకు లింకేజీ డీపీఎం దాస్, ఏపీఎం రాజు, ఎస్‌బీఐ మేనేజర్లు రాజేశ్, శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ రమణాచారి, ఏపీఎంలు శ్రీధర్‌రెడ్డి, క్రాంతి, రమాదేవి పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామన్ననాయక్

సమావేశంలో మాట్లాడుతున్న రామన్ననాయక్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 18: డీఎస్సీ–2008లో ఎంపికైన అభ్యర్థులకు న్యాయం చేయాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం (ఎన్‌టీవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 ఏళ్లుగా ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూసిన అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. దీంతో సెప్టెంబర్ 2024లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశారని పేర్కొన్నారు. కానీ డీఈవో వాసంతి చివరకు జే.సోమ్లా, ఈ.వెంకన్న, పి.శంకర్, ఈ.రాములు, బి.వాల్యా, బి.రవీందర్, రామ్మూర్తి, సీహెచ్.భాస్కర్, జి.గణేశ్ పేర్లు తొలగించారని, డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత అభ్యర్థులతోపాటు గుగులోత్ సంజీవ్‌కుమార్, పోరిక శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్

పరకాల: మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

పరకాల/ శాయంపేట, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. పరకాల పట్టణంలోని ఎస్వీ కళాశాల, శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ మండల మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్య వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల కోట్ల స్కాలర్‌సిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులను కళాశాలలు ఇబ్బందులు పెడుతున్నాయని పేర్కొన్నారు. కాగా, పరకాల మండల కమిటీ అధ్యక్షుడిగా మడికొండ ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా కొగిల ప్రేమ్, ఉపాధ్యక్షుడిగా గౌతమ్‌కుమార్, ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. బొచ్చు కల్యాణ్, బీరెడ్డి జశ్వంత్, బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్, సాయికుమార్, యశ్వంత్, అనిల్, గణేశ్, సాయి, నాని, అంజలి, నందిని, కావ్యశ్రీ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ శాయంపేట మండల అధ్యక్షులుగా సిద్ధార్థ, కార్యదర్శిగా ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా గణేశ్, భరత్, సహాయ కార్యదర్శులుగా అయాన్, అభి, సభ్యులుగా భానుశ్రీ, వరుణ్, అజయ్, అశ్రిత, మహేందర్, ఉమేశ్, సమీర్, మనోజ్, అశ్విత్ ఎన్నికైనట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్, చెన్నూరి సాయికుమార్ పాల్గొన్నారు.

బొలెరో వాహనం దగ్ధం

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో మంగళవారం ప్రమాదవశాత్తు బొలెరో వాహనం మంటలు చెలరేగి కాలిపోయింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడిగుడ్ల లోడ్ ఉన్న బొలెరో వాహనాన్ని డ్రైవర్ ఖలీం అన్సార్ మంగళవారం తెల్లవారుజామున ఎల్కతుర్తిలో కొద్దిసేపు ఆపుకొని తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వాహనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేశాడు. అప్పటికే వాహనం మొత్తం మంటలు వ్యాపించాయి. దీంతో సుమారుగా రూ.9లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. వాహన యజమాని కోటిలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కాజీపేటలో వ్యక్తి అదృశ్యం


బాలరాజు

కాజీపేట, ఫిబ్రవరి 18: ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు మంగళవారం కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సిద్ధార్థ నగర్‌కు చెందిన దండు బాలరాజు(56) మూడు రోజుల క్రితం వ్యక్తిగత పనిపై బయటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. అతడి సోదరి బొల్లంపల్లి తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

భద్రకాళీ చెరువు పూడికతీతలో వేగం పెంచాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య
- క్షేత్ర స్థాయిలో పనుల పరిశీలన

భద్రకాళీ చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అధికారులు

వరంగల్, ఫిబ్రవరి 18: భద్రకాళీ చెరువు పూడికతీత పనులు వేగంగా చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో భద్రకాళీ చెరువును పరిశీలించారు. చెరువు పూడికతీత పనులు, మట్టి తరలింపు విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడికతీత పనుల్లో భాగంగా మట్టి తరలింపులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మట్టి తరలించే వాహనాల రాకపోకలకు వీలుగా అంతర్గత రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. మట్టి తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మట్టి తరలించే వాహనాల నమోదు కోసం జంక్షన్‌లో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సిబ్బంది 24గంటలు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పూడికతీత మట్టి కావాలనుకునే వారు క్యూబిక్ మీటర్‌కు రూ.72 చెల్లించి తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, మున్సిపల్, కుడా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని చౌరస్తా సుందరీకరణ పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎల్కతుర్తి టౌన్ ఫీడర్, గ్రామీణ ఫీడర్‌లోని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం తదితర పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం

శాయంపేట, ఫిబ్రవరి 18: ఓ హత్య కేసు ఛేదించినందుకు శాయంపేట సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై పరమేశ్, కానిస్టేబుల్ సతీష్‌ను మంగళవారం సన్మానించారు. మండలంలోని ఆరెపల్లికి చెందిన వృద్ధురాలు వాడికాల బొందమ్మ ఏడాదిన్నర క్రితం హత్యకు గురైంది. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో శాయంపేట సీఐ రంజిత్‌రావు కేసును దర్యాప్తు చేసి ఛేదించారు. ఈ క్రమంలో హత్యకు గురైన బొందమ్మ కుమారుడు, కోడలు స్టేషన్‌కు చేరుకుని సీఐ, ఎస్సై, సిబ్బందిని శాలువాలు కప్పి సన్మానించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

నయీంనగర్, ఫిబ్రవరి 18: హనుమకొండలోని లష్కర్ సింగారం, వాజ్‌పేయికాలనీలో మంగళవారం సురక్ష కేంద్రం, టీబీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న, మాధురి, హైదర్ సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని సూచించారు. సురేశ్, శ్రీధర్, శ్రీనివాస్, బాబు, సుధాకర్, కిరణ్, నగేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రాజేంద్రకుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

రాజేంద్రకుమార్

దామెర, ఫిబ్రవరి 18: మండల కేంద్రానికి చెందిన అల్లం రాజేంద్రకుమార్‌కు భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పట్టా హైదరాబాద్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ప్రదానం చేసింది. భౌతికశాస్త్రంలో 'ఎఫెక్ట్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్ అయాన్స్ డోపిడ్ స్ట్రాన్షియం మెగ్నీషియం ఫాస్పేట్ నానోపౌడర్స్' అనే అంశంపై డాక్టర్ అరుంధతి పర్యవేక్షణలో రాజేంద్రకుమార్ పరిశోధన పూర్తి చేశాడు. ఈ సందర్భంగా డీమ్డ్ టు బీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను రాజేంద్రకుమార్ పొందారు.

అంతర్జాతీయ సదస్సుకు జితేందర్

నయీంనగర్, ఫిబ్రవరి 18: నేవీ ముంబైలో గురువారం నుంచి మూడురోజుల పాటు జరిగే భౌతికశాస్త్ర పదార్థ విభాగానికి సంబంధించిన అంతర్జాతీయ సదస్సుకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు జితేందర్ హాజరై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ప్రవీణ్‌కుమార్, జితేందర్ రాసిన పరిశోధన పత్రానికి ముంబై నుంచి సదస్సు నిర్వాహకులు ఆహ్వానం ఇప్పటికే పంపారు. వీరిద్దరినీ పలువురు అభినందించారు.

చేనేత సంఘాల పీఏసీల పదవీ కాలం పొడిగింపు

చేనేత సహకార సంఘం కార్యాలయం

శాయంపేట, ఫిబ్రవరి 18: చేనేత సహకార సంఘాల పీఏసీల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హనుమకొండ జిల్లా చేనేత, జౌళీశాఖ అధికారులు సంఘాలకు సర్క్యులర్ జారీ చేశారు. జిల్లాలో 16 చేనేత సంఘాలు ఉన్నాయి. చేనేత సంఘాల పాలకవర్గాల పదవీ కాలం ఎప్పుడో పూర్తవగా, అవే పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగిస్తున్నారు. ఈనెల 10తేదీతో మరో సారి పీఏసీల పదవీ కాలం పూర్తయ్యింది. దీంతో ఈనెల 10 నుంచి ఆగస్టు 9 తేదీ వరకు పీఏసీలను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు జరిగే వరకు వీరే పదవిలో ఉండనున్నారు. జిల్లాలోని 16 సొసైటీ పరిధిలో పీఏసీలు మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. చేనేత సంఘాలకు 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఇప్పటికే అవే పాలకవర్గాలు పదవిలో ఉన్నారు. చేనేత సంఘాలకు ఎన్నికలు త్వరగా జరిపించాలని పీఏసీలు కోరుతున్నారు. అనుకున్నట్టుగానే చేనేత సంఘాలకు ప్రభుత్వం ఎన్నికలు జరిపించకుండా పదవీ కాలాన్ని పొడిగించింది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికలు జరగలేదు. ఇటీవలే వ్యవసాయ సహకార సంఘాల పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ నేపథ్యంలో చేనేత సంఘాలకు పొడిగింపు అనివార్యంగా మారినట్లు చెబుతున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో! అని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి

వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హనుమకొండ, ఫిబ్రవరి 18: ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై సీఎస్ మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై చర్చించి కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. సీఎస్ మాట్లాడుతూ గత ఏడాది మార్చిలో వచ్చిన అత్యధిక విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్లు ఈనెలలోనే వస్తోందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1912కి తెలియజేయాలన్నారు. మిషన్ భగీరథ, పట్టణాలలో అమృత్ కింద చేపట్టిన తాగు నీటి స్కీం, ఇతర తాగునీటి స్కీంలకు, ఆస్పత్రులకు, వ్యవసాయ ఫీడర్లకు నిరంతరాయ సరఫరా ఉండేలా ప్రత్యేకంగా పరిరక్షించాలన్నారు. కలెక్టర్లు సబ్ స్టేషన్లను తనిఖీ చేయాలన్నారు. రైతు భరోసా పోర్టల్‌లో సాగుకు యోగ్యం కాని భూముల నమోదు ప్రక్రియ 5రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎస్సారెస్పీ సాగునీరు అందే కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ సూర్యాపేట, మహబూబాద్ జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేదని, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చేతిపంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో ధర్మసాగర్ నుంచి నీటి సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 24 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్లలో అదనంగా 21 నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 18: వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల్లో దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తాను ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి మళ్లీ గెలిపించాలని కోరారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌లో 4వ క్రమసంఖ్య ఎదురుగా బాక్స్‌లో 1వ నంబర్ వేయాలని కోరారు. ఎమ్మెల్సీగా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను రక్షించేందుకు పాటుపడతానని, 22వేల ఉపాధ్యాయ పదోన్నతులు రావటానికి, 35వేల బదిలీలు జరిగేందుకు కృషి చేశానని, పాఠశాలల్లో సర్వీస్‌పర్సన్‌కు విద్యార్థుల సంఖ్య కనుగుణంగా రూ.3వేల నుంచి రూ.20వేల వేరకు వేతనం ఇచ్చేలా ప్రయత్నించి విజయం సాధించినట్లు గుర్తుచేశారు.

నర్సిరెడ్డిని మరోసారి గెలిపించండి

సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 18: నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకుడు మాణిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో యుటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నర్సిరెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, టీఎస్ యూటీఎఫ్ ఆత్మకూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సునిల్‌కుమార్, రమణ పాల్గొన్నారు.

ముల్కనూరు సహకార సంఘాన్ని సందర్శించిన శ్రీలంక బృందం

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 18: ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని శ్రీలంక దేశంలోని సహకార సంఘాల బృందం మంగళవారం సందర్శించింది. వ్యవసాయ బ్యాంకింగ్‌లో అంతర్జాతీయ సహకారం, శిక్షణ కేంద్రంలో భాగంగా ఈ నెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జాతీయ గ్రామీణాభివృద్ధి – పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సదస్సులు జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని శ్రీలంక దేశంలోని వివిధ సహకార సంఘాల బృందం సందర్శించింది. రైతుల పరస్పర సహకారంతో సంఘం అభివృద్ధి చెందుతున్న తీరు అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముల్కనూరు మహిళా సహకార డెయిరీని సందర్శించారు. డెయిరీ ఆర్థిక అభివృద్ధి, మార్కెటింగ్ రంగాలపై అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ వివరించారు. ముల్కనూరు సహకార సంఘం, మహిళా డెయిరీ జీఎంలు మార్పాటి రాంరెడ్డి, మార్పాటి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాల్దీవులు దేశ బృందం పర్యటన

భీమదేవరపల్లి, ముల్కనూరు గ్రామాలను మంగళవారం మాల్దీవుల దేశ బృందం పర్యటించింది. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముల్కనూరు బీసీ కాలనీలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. ముల్కనూరులో కంపోస్టు ఎరువుల తయారీ, వైకుంఠథామాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గ్రామపంచాయతీ చేరుకుని జీపీ నిర్వహణ, అభివృద్ధిపై అధ్యయనం చేశారు. బుధవారం ముల్కనూరు సహకార పరపతి సంఘం, ముల్కనూరు మహిళా సహకార డెయిరీ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వహణ, మహిళా సంఘాల పనితీరుపై అధ్యయనం చేస్తారని ఎంపీడీవో వీరేశం వెల్లడించారు. వీరితోపాటు డీఆర్డీవో ఏపీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీవో నాగరాజు, కర్ర శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ పాల్గొన్నారు.


ముల్కనూరు సహకార సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డితో శ్రీలంక సహకార సంఘాల బృందం


ముల్కనూరులో కంపోస్టు ఎరువుల తయారీ, వైకుంఠ థామాన్ని పరిశీలిస్తున్న మాల్దీవుల దేశ బృందం

కేసీఆర్‌కు బర్త్ డే శుభాకాంక్షలు

కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 18: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో కలుసుకొని శుభాకాంక్షలు అందజేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిస్థితి, అభివృద్ధిపై సతీశ్‌కుమార్‌ను ఆరా తీశారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారంటీల అమలు కోసం నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల పక్షాన పోరాడాలని సూచించినట్లు సతీశ్‌కుమార్ తెలిపారు.

బయోగ్యాస్‌ను ప్లాంట్ సమర్థంగా నిర్వహించాలి

మేయర్ గుండు సుధారాణి

బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఫిబ్రవరి 18 : బయోగ్యాస్ ప్లాంట్‌ను సమర్థంగా నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ ఆవరణలోని బయోగ్యాస్ ప్లాంట్‌ను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రోజూ ఆహార వ్యర్థాలు, కూరగాయలు సేకరించి బయోగ్యాస్ ప్లాంట్‌కు తరలించాలన్నారు. రోజూ సుమారు 2 టన్నుల వ్యర్థాలు తరలిస్తే బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ కార్పొరేషన్ కార్యాలయానికి రెండు గంటలు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. తడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. తడి చెత్త ద్వారా ఉత్పర్తయ్యే ఎరువును హార్టికల్చర్ విభాగం ద్వారా నర్సరీల్లోని మొక్కల పెంపకానికి వినియోగించాలని అన్నారు. నగర ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని కోరారు. స్వచ్ఛనగరం లక్ష్యంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పట్టుకున్న పీడీఎస్ బియ్యంట్రాలీ వద్ద ఎస్సై అశోక్

భీమదేవరపల్లి/ నడికూడ, ఫిబ్రవరి 18: జిల్లాలో పోలీసులు పలుచోట్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. భీమదేవరపల్లి మండలం సిద్దిపేట – హనుమకొండ ప్రధాన రహదారిపై వంగర క్రాసింగ్ వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ముల్కనూరు ఎస్సై నండ్రు సాయిబాబు తెలిపారు. ముల్కనూరుకు చెందిన కస్తూరి శివప్రసాద్ బొలెరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే నడికూడ మండలం కంఠాత్మకూర్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని దామెర పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. విచారించగా పీడీఎస్ బియ్యాన్ని తెట్టె రాజు, బోయిని కృష్ణతో కలిసి ప్రజల వద్ద కొని బయట ఎక్కువకు అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

బహుమతుల ప్రదానం

బహుమతులు ప్రదానం చేస్తున్న కిశోర్

నయీంనగర్, ఫిబ్రవరి 18: సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 17, 18న నిర్వహించిన హనుమకొండ జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. క్రీడల్లో గెలుపొందిన యువతీ యువకులకు బహుమతులతోపాటు గోల్డ్, సిల్వర్ మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమానికి నిట్ ప్రొఫెసర్ ఆనంద్‌కిశోర్, డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్, యూత్ ఆఫీసర్ అన్వేశ్ హాజరై సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, శ్రీదేవి, శ్రీకాంత్, నక్క భరత్, మహేందర్ పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంను కలిసిన టీజీ క్యాబ్ చైర్మన్

హనుమకొండ, ఫిబ్రవరి 18: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కలిశారు. డీసీసీబీ, సహకార సంఘాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగించిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జానారెడ్డిని డీసీసీబీ చైర్మన్లతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీబీ చైర్మన్లు సత్తయ్య, రమేశ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బోజారెడ్డి, వేంకటేశ్వరరావు ఉన్నారు.

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్షకు తరలిన నాయకులు

నిరాహార దీక్షలో పాల్గొన్న కాజీపేట నేతలు

కాజీపేట, ఫిబ్రవరి 18: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రైల్వే సంచాలన్ భవన్ ఎదుట చేపట్టిన రైల్వే ఉద్యోగుల ఒక్కరోజు నిరాహార దీక్షకు మంగళవారం కాజీపేట రైల్వేస్టేషన్ మీదుగా యూనియన్ నేతలు, రైల్వే కార్మికులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైల్వే మజ్దూర్ యూనియన్ కో ఆర్డినేటర్ నాయిని సదానందం మాట్లాడుతూ రైల్వే కార్మికుల 33 న్యాయమైన కోరికలను రైల్వేశాఖ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తాని హెచ్చరించారు. తరలిన వారిలో యూనియన్ సెక్రటరీలు సమ్మయ్య, వేద ప్రకాశ్, బాల మునిరాజు, రాజేందర్, చైర్మన్లు శ్రీనివాస్ యాదవ్, రాజు, ట్రెజరర్స్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, యాదగిరి, రాజయ్య, రామకృష్ణ, వీ.యాదగిరి ఉన్నారు.

దరఖాస్తులు పరిశీలించేదెప్పుడో?

తహసీల్దార్ టేబుల్‌పై పెండింగ్

తహసీల్దార్ టేబుల్‌పై ఉన్న దరఖాస్తులు

కమలాపూర్, ఫిబ్రవరి 18: రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరిన ఆయా దరఖాస్తులు టేబుల్‌పై కట్టలుగా పేర్చారు. ఆన్‌లైన్‌లో పరిశీలించి అప్రూవ్ చేయాల్సి ఉంటుంది. తహసీల్దార్ సెలవులో ఉండగా ఇన్‌చార్జి తహసీల్దార్ పట్టించుకోకపోవడంతో పడి ఉన్నాయి. దీంతో అధికారులు ఎప్పుడు పరిశీలిస్తారో! అని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.